సాక్షి అనంతపురం

మంగళవారం । 1 । జూలై । 2025



గూగూడులో కొలువుదీరిన పీర్లు

నార్పల: మండల పరిధిలోని గూగూడులో మొహర్రం బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఆలయంలో పీర్లు కొలువుదీరాయి. ఈ సందర్భంగా ఆలయంలో కుళ్లాయి స్వామి దర్శనానికి జిల్లా నలు మూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అగ్ని గుండం వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

హారికకు కేజీబీవీలో సీటు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: బుక్కరాయసముద్రం మండలం దండు వారిపల్లికి చెందిన బి.హారికకు కేజీబీవీలో సీటు ఇచ్చేందుకు అధికారులు అంగీకరించారు. కేజీబీవీ ప్రవేశాలకు ఎస్‌ఓలు, అధికారులపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లు చేస్తుండడంతో అర్హులైన ఆడబిడ్డలకు అన్యాయం జరుగుతోందంటూ సోమవారం 'సాక్షి'లో 'సీటు.. తమ్ముళ్లతో తలపోటు!' శీర్షికన కథనం వెలువడిన సంగతి తెలిసిందే. దండువారిపల్లికి చెందిన బి.ఉజ్జినప్ప కూతురు బి.హారిక 7వ తరగతి పూర్తయింది. ఈ బాలిక తల్లి చనిపోయింది. 8వ తరగతిలో ప్రవేశానికి బుక్కరాయసముద్రం, కురుగుంట కేజీబీవీల్లో హారిక దరఖాస్తు చేసుకున్నా అవకాశం ఇవ్వలేదు. తండ్రి రోజూ సమగ్రశిక్ష కార్యాలయం చుట్టూ తిరుగుతున్న వైనాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకురాగా.. కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. హారికకు అవకాశం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఏపీసీ శైలజ బుక్కరాయసముద్రం కేజీబీవీ ఎస్‌ఓతో ప్రత్యేకంగా మాట్లాడి 8వ తరగతి ప్రవేశానికి అవకాశం కల్పించాలని ఆదేశించారు. కేజీబీవీ నుంచి బాలిక తండ్రికి ఫోన్ చేశారు. ఏపీసీ శైలజ మాట్లాడుతూ అనాథ బాలికలకు తొలి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

రేపు బదిలీల కౌన్సెలింగ్



అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ఈనెల 2న ఉదయం 10 గంటలకు సమగ్రశిక్ష కార్యాలయంలో చేపట్టనున్నట్లు ఏపీసీ శైలజ తెలిపారు. ఇప్పటికే సీనియార్టీ జాబితా తయారు చేసి అభ్యంతరాలు కూడా స్వీకరించామన్నారు. పరిశీలించిన అనంతరం తుది జాబితాను https://samagrashikshaatp.blogspot.com వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. అభ్యర్థులు అపాయింట్‌మెంట్ లెటర్లు, అదనపు పాయింట్లు పొందిన వారు స్పౌజ్, మెడికల్, పీహెచ్, డెత్, లీగల్ సెపరేటెడ్ తదితర సర్టిఫికెట్లు తీసుకు రావాలని ఏపీసీ సూచించారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన కారు



మృతి చెందిన గొర్రెలు


ఉరవకొండ రూరల్: మండలంలోని బూదగవి సమీపంలో అనంతపురం-బళ్లారి జాతీయ రహదారిపై సోమవారం 50 గొర్రెలున్న మందపై ఓ కారు దూసుకెళ్లింది. ఘటనలో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఘటనతో రూ.2 లక్షలు నష్టపోయినట్లు బూదగవి గ్రామానికి చెందిన బాధిత కాపరులు ఎర్రిస్వామి, లక్ష్మన్న, శివ వాపోయారు.

గురుకులాల్లో ఇంటర్ మిగులు సీట్లకు కౌన్సెలింగ్

అనంతపురం రూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయ సమన్వయ అధికారి జయలక్ష్మి తెలిపారు. తమ నుంచి సమాచారం అందిన విద్యార్థులు మాత్రమే హాజరు కావాలన్నారు. ఈ నెల 2న బీ పప్పూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బాలికలకు ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, బాలురకు 2 నుంచి 4 గంటల వరకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

అయ్య బాబోయ్.. ఇంటింటికీనా!

అలివిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు..తర్వాత వాటిని గాలికొదలడంతో ఐదేళ్ల వ్యతిరేకతను ఏడాదిలోనే మూటగట్టుకున్నారు. మహిళలు, రైతులు, ఉద్యోగులు ఇలా ఏ వర్గాన్ని కదిలించినా కూటమి పాలనపై నిప్పులు చెరుగుతున్నారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సుపరిపాలన అంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని చెప్పడంతో ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.



టీడీపీ ఎమ్మెల్యేల్లో గుబులు

- ఏడాదిలో ఒక్క ఎన్నికల హామీ సరిగా నెరవేర్చని కూటమి సర్కారు
- విచ్చలవిడిగా మద్యం విక్రయాలపై మహిళల ఆగ్రహం
- పైసా సాయం చేయకపోవడంతో రైతన్నల్లో అసంతృప్తి
- ఈ క్రమంలో 'సుపరిపాలన' అంటూ ప్రతి ఇంటికీ వెళ్లమంటున్న బాబు
- క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకుని ఎమ్మెల్యేల గుండెల్లో రైళ్లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికల్లో గెలిచి ఏడాది దాటినా ఏ ఎమ్మెల్యే కూడా ఒక్క పల్లెకూ వెళ్లిన దాఖలాలు లేవు. ఈ క్రమంలోనే ఏడాదిలో చేసిన 'సుపరిపాలన'ను ఇంటింటికీ వెళ్లి వివరించాలని సీఎం చంద్రబాబు చెబుతుండడంతో ప్రజల వద్దకు వెళ్లి ఏం చేశామని చెప్పాలంటూ ఎమ్మెల్యేలు చర్చించుకుంటున్నట్టు తెలిసింది. ఓవైపు రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తున్నాం.. మరోవైపు పెన్షన్ మినహా అన్ని పథకాలకూ మంగళం పాడాం.. 'అమ్మ ఒడి' సగం కోతలు, సగం వాతలు తరహాలో ఇచ్చాం.. ఈ పరిస్థితుల్లో ఇంటింటికీ వెళితే మరింత వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పుడు వారి దగ్గరకు వెళ్లడం అంత మంచిది కాదని చాలా మంది ఎమ్మెల్యేలు అభిప్రాయపడుతున్నారు.

కబ్జాలు, ఆక్రమణలతో వణుకు

జిల్లాలోని అర్బన్ ప్రాంతాల్లో ఎమ్మెల్యేల అనుచరులు భూ ఆక్రమణలు, కబ్జాలు ఇబ్బడిముబ్బడిగా చేశారు. దీంతో బాధితులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి దగ్గరకు వెళ్తే నిలదీసి కడిగి పారేస్తారన్న భయం ఎమ్మెల్యేల్లో ఉంది. అంతేకాదు తమ కార్యకర్తలు ఏం చేసినా పోలీస్ స్టేషన్లకు ఫోన్లు చేసి విడిపించుకుంటున్నారు. బాధితులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు. 'తమ్ముళ్లు' దాడులు చేసినా బాధితులకు న్యాయం లేదు. దీంతో ఎమ్మెల్యేలు తమ వార్డుల్లోకి వస్తే నిలదీసేందుకు స్థానికులు సిద్ధంగా ఉన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మహిళలు 'బెల్టు' తీస్తారు..!

ఉమ్మడి జిల్లాలో 230 వైన్ షాపులుండగా.. 2,100 బెల్టుషాపులు ఉన్నాయి. ఈ క్రమంలో విచ్చలవిడిగా మద్యం లభ్యమవుతుండడంతో పేద కుటుంబాలు గుల్లవుతున్నాయి. దీంతో మహిళల్లో ఆగ్రహ జ్వాలలు కట్టలు తెంచుకుంటున్నాయి. ఇప్పటికే శ్రీ సత్యసాయి జిల్లాలో కొన్ని చోట్ల నిరసనలకు దిగారు. ఇలాంటి సమయంలో పల్లెలకు ఎమ్మెల్యేలు వెళితే 'బెల్టు' తీస్తారేమోనన్న భయం వారిని వెంటాడుతోంది.

ఆగ్రహంలో రైతన్నలు

ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయింది. ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని ఎన్నికల ముందు ప్రకటించారు. కానీ రెండో ఏడాది వచ్చినా పైసా ఇవ్వలేదు. ఖరీఫ్ ప్రారంభమైనా రూపాయి అందించలేదు. పైగా పండిన పంటలకు గిట్టుబాటు ధర లేదు. దీంతో అన్నదాతలు ఆగ్రహంతో ఉన్నారు. 'ఎమ్మెల్యేలైతే మాకేంటి..ఊర్లోకి వస్తే చూస్తాం' అంటూ మండిపడుతున్నారు.

ఉద్యోగులు నిజం తెలుసుకున్నారు..

ఉద్యోగులందరూ ఎన్నికల్లో టీడీపీకి గంపగుత్తగా ఓట్లేశారని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. కానీ తాజా పరిస్థితులు చూస్తే ఉద్యోగ వర్గాలు ప్రభుత్వ తీరుపై నిప్పులు కక్కుతున్నాయి. బదిలీల్లో నాయకుల పాత్రపై అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. సిఫార్సు లేఖలు, లంచాలతో తమకు కావాల్సిన వారిని దగ్గరకు చేర్చుకోవడంతో వేలాది మంది సామాన్య ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి విభాగం బదిలీలోనూ అవినీతి అక్రమాలే. ఈ సమయంలో ఎమ్మెల్యేలకు అన్నివర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురయ్యే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

- హాజరుకానున్న పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి



పార్టీ నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య తెలిపారు. ముదిగల్లు రోడ్డులోని శ్రీనివాస కల్యాణమండపంలో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను నాయకులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, పార్లమెంట్ అబ్జర్వర్ నరేష్‌కుమార్ రెడ్డి హాజరవుతారన్నారు.మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ విభాగం కన్వీనర్ ఐ.సుధీర్, వివిధ మండలాల కన్వీనర్లు గోళ్ల సూర్యనారాయణ, పి.చంద్రశేఖర్ రెడ్డి, బ్రహ్మసముద్రం ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, కౌన్సిలర్లు లక్ష్మన్న, పరమేశ్వరప్ప, వివిధ విభాగాల అధ్యక్షులు దొడగట్ట మురళి, కురుబ పాతలింగ, రామిరెడ్డి, కిరీటి యాదవ్, మల్లికార్జునతో పాటు పలువురు పాల్గొన్నారు.

అయ్యా.. సమస్యలు పరిష్కరించండి

- అధికారులకు బాధితుల వినతి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 640 అర్జీలు



❒ ఈ వృద్ధురాలి పేరు బావమ్మ. శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామం. పింఛను మంజూరు చేయాలంటూ కలెక్టర్‌ను కలిసి విన్నవించింది. భర్త మూడేళ్ల క్రితం చనిపోయాడని చెప్పింది. జీవనం కష్టంగా మారిందని పింఛను మంజూరు చేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని వాపోయింది.

అనంతపురం అర్బన్: 'అయ్యా మా కష్టాలు వినండి... ఆదుకోండి' అంటూ అధికారులకు ప్రజలు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, తిప్పేనాయక్, మల్లికార్జునుడు, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 640 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం సమస్యల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీల పరిష్కారంలో ఏస్థాయిలోనూ నిర్లక్ష్యానికి ఆస్కారం ఇవ్వకూడదని ఆదేశించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని చెప్పారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

వినతుల్లో కొన్ని...

- స్వాతంత్ర్య సమరయోధుడు, వడ్డెర్ల ఆరాధ్యుడు వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం కార్యదర్శి మంజుల నారాయణ విన్నవించాడు. నగర పరిధిలోని నడిమివంక ప్రాంతంలో గంగమ్మ గుడి పక్కన స్థలం కేటాయిస్తే విగ్రహం ఏర్పాటు చేసుకుంటామని విజ్ఞప్తి చేశాడు.
- పీఎం విశ్వకర్మ పథకం కింద ఎంపికైనప్పటికీ రుణం మంజూరు కాలేదని బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురం గ్రామానికి చెందిన కొండన్న ఫిర్యాదు చేశాడు. శిక్షణ ఇచ్చారని, సర్టిఫికెట్‌తో పాటు రూ.4 వేలు వచ్చాయని చెప్పాడు. గుత్తి రోడ్డులోని యూనియన్ బ్యాంక్ అధికారులు రుణం మంజూరు చేయడం లేదని వాపోయాడు.
- వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీల బదిలీల్లో అక్రమాలు జరిగాయని అనంతపురం నవోదయ కాలనీకి చెందిన బి.శ్రీకాంత్ ఫిర్యాదు చేశాడు. స్పౌజ్ కేటగిరీకి చెందిన చాలా మంది తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించారని, స్పెషల్ కేటగిరీ వారికి ప్రాధాన్యత కల్పించకుండా జనరల్‌గా పిలిచారని వివరించాడు. సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరాడు.

బదిలీల్లో వివాదాలకు తావివ్వొద్దు

సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో వివాదాలు, విమర్శలకు తావివ్వకూడదని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. బదిలీలు నిర్వహిస్తున్న శాఖల అధికారులకు ఎంపీడీఓలు, తహసీల్దార్లు సహకరించాలని చెప్పారు. అధికారులతో వాట్సాప్ గ్రూప్ తయారు చేసుకుని, బదిలీ అయిన ఉద్యోగుల వివరాలను ఎక్సెల్ షీట్‌లో ఉంచాలన్నారు.

నిధులు విడుదల

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనం, పీఎఫ్ చెల్లింపునకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయ్యాయని కలెక్టర్ తెలిపారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలో రూ.3.74 కోట్లు, మడకశిర పరిధిలో రూ.2.50 కోట్లు విడుదలయ్యాయన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెల్లింపులు జరిగాయన్నారు.

తాడిపత్రిలో ప్రజాస్వామ్యం ఖూనీ

- పట్టణంలో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' నిర్వహించి తీరుతాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత,చిత్రంలో మాజీ ఎంపీ మాధవ్,మాజీ ఎమ్మెల్యేలు పెద్దారెడ్డి, విశ్వ, పార్టీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రారెడ్డి తదితరులు

అనంతపురం సెంట్రల్: తాడిపత్రిలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. పోలీసులే దగ్గరుండి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయిస్తుంటే ప్రజలు సిగ్గుతో తలదించుకుంటున్నారని దుయ్యబట్టారు. సోమవారం ఆయన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, విశ్వేశ్వర రెడ్డితో కలిసి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోవడంతో ఎంత నష్టం జరిగిందో ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలోని గ్రామ, వార్డుల్లో త్వరలో పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగానే ఆదివారం తాడిపత్రి నియోజకవర్గంలో కార్యకర్తలను సమాయత్తం చేయడానికి పార్టీ సమన్వయకర్త కేతిరెడ్డి పెద్దారెడ్డి వెళ్తే బలవంతంగా అరెస్ట్ చేయడమేంటని ప్రశ్నించారు. జిల్లాలో ఎక్కడా లా అండ్ ఆర్డర్ సమస్య లేదని.. తాడిపత్రిలో మాత్రమే ఉందనడం సబబు కాదన్నారు. పెద్దారెడ్డి నియోజకవర్గంలో తిరిగేందుకు స్వయంగా ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చినా పోలీసులు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్యేను శాసించే అధికారం ఎవరిచ్చారని నిలదీశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తాడిపత్రిలో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' నిర్వహించి తీరుతామని 'అనంత' స్పష్టం చేశారు.

దరిద్రమైన రాజకీయాలు ఆపెయ్..

పేకాట, గంజాయి బ్యాచ్‌లను వెంటపెట్టుకొని తాడిపత్రిలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి దరిద్రమైన రాజకీయాలు చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలని కోరితే పరిశీలిస్తానని ఎస్పీ అనడం ఏంటని, ఎవరితో మాట్లాడి ఆయన నిర్ణయం తీసుకుంటారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డితో చర్చించేకి వీరికేమైనా బాసా అని నిలదీశారు. పెద్దారెడ్డి ఇంటి వద్దకు వెళ్లిన వారి ఫొటోలు, వీడియోలు ఉన్నాయని, వారికి రపా..రపా ఉంటుందని జేసీ ప్రభాకర్‌రెడ్డి పబ్లిక్‌గా హెచ్చరిస్తుంటే చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు. సొంతింటికి తనను ఎందుకు పోనివ్వరో సమాధానం చెప్పాలన్నారు. 'గతంలో మీరు చేశారు' అనే మాటలకు కట్టుబడి ఉన్నానని, దీనిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. భార్యను అసభ్యంగా మాట్లాడానని జేసీ అంటున్నారని, తాను అన్నట్లు ఆ అక్క నోటితో పలికించాలని.. నిరూపిస్తే తాడిపత్రికి వెళ్లనని స్పష్టం చేశారు.

అడ్డుకునే హక్కు ఎవరిచ్చారు..?

ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి తన నియోజకవర్గానికి వెళ్లకూడదని దేశంలో ఎక్కడైనా ఉందో చెప్పాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి నిలదీశారు. ఎస్పీని అనేకమార్లు కలిసినా, కోర్టు ఉత్తర్వులున్నా అనుమతివ్వకపోవడం సరి కాదన్నారు. ఎవరి వల్ల లా అండ్ ఆర్డర్ సమస్య వస్తే వారిని అరెస్ట్ చేయాలన్నారు. కుట్రలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొంటామని, ప్రజల వద్దే ఎండగడతామని హెచ్చరించారు. ప్రజలు తమ గురించి ఏమనుకుంటున్నారనే విషయాన్ని పోలీసులు తెలుసుకోవాలని హితవు పలికారు.

ఇది కొత్త తరహా పోలీసింగ్..

జిల్లాలో పోలీసు వ్యవస్థ నక్సలైట్లు, ఫ్యాక్షనిస్టులు, రౌడీషీటర్లను ఏరిపారేసిందని, కానీ నేడు జేసీ ప్రభాకర్‌రెడ్డి వద్దకు వెళ్లలేక కొత్త తరహా పోలీసింగ్‌ను చూపిస్తున్నారని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దారెడ్డి ఇంటికి వెళ్లిన తమ పార్టీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్‌కు కూడా దేశ చట్టాలు విస్తరించాయని, కానీ తాడిపత్రిలో మాత్రం జేసీ ప్రభాకర్‌రెడ్డితో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోందని విమర్శించారు.

మీ నాయన చర్యలను సమర్థిస్తున్నావా?

'యువకుడు, చదువుకున్న వ్యక్తి అని చెబుతూ రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యే అయిన అస్మిత్ రెడ్డీ.. మీ నాయన చర్యలను నువ్వైనా సమర్థిస్తున్నావా' అని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ప్రశ్నించారు. పట్టపగలే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నా పోలీసులు వెన్నెముక లేన్నట్లుగా పనిచేస్తున్నారన్నారు. రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటున్నారో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం అయితే ఆ ప్రతులను ప్రజలకు పంచాలని సూచించారు.

అధికార అండ.. పంచాయతీలపై బండ!

- కంబదూరు మండలంలో విండ్‌పవర్ సంస్థల ఇష్టారాజ్యం
- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సంస్థ ఆధ్వర్యంలో పనులు
- గ్రామసభలు నిర్వహించకుండా, తీర్మానాలు లేకుండా ముందుకు
- సామాజిక బాధ్యతనూ విస్మరించడంపై సర్వత్రా విమర్శలు

కళ్యాణదుర్గం: అధికారం మాదే.. మేమేం చేసినా అడిగేవారెవరనే రీతిలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు చెందిన ఎస్‌ఆర్‌సీ సంస్థ వ్యవహరిస్తోంది. పంచాయతీల అభివృద్ధికి ఆటంకం సృష్టిస్తోంది. వివరాలు.. కంబదూరు మండలంలో 12కు పైగా సంస్థలు గాలిమరలను ఏర్పాటు చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ముందుగా ఆయా గ్రామ పంచాయతీల్లో నెడ్‌క్యాప్, రెవెన్యూ, స్థానిక పంచాయతీ అధికారులతో కలిసి గ్రామాల్లో సభలు నిర్వహించాల్సి ఉంది. అయితే, కంబదూరు మండలంలో అనుమతులు పొందిన పంచాయతీల్లో ఇప్పటికీ ఒక్క గ్రామ సభ కూడా చేపట్టలేదు. పనులు ప్రారంభిస్తున్నట్లు కనీస సమాచారం కూడా సర్పంచులకు ఇవ్వలేదు.

సామాజిక బాధ్యత మరచి..

కంబదూరు మండలంలో విండ్ పవర్ ఏర్పాటు పనులన్నీ ఎస్‌ఆర్‌సీ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో 'ఎస్‌ఆర్‌సీ' అండ చూసుకుని ఆయా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. 'కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ' కార్యక్రమం కింద సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ఆయా గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. తాగునీటి కల్పన, పాఠశాలల అభివృద్ధి, పారిశుధ్యం, హెల్త్‌క్యాంప్‌ల నిర్వహణ తదితర సామాజిక కార్యక్రమాల విషయమే మరచిపోయారు. దీనికితోడు ఆయా గ్రామాల్లో మట్టిరోడ్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ఇతర మిషన్లను హడావుడిగా సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో భారీ వాహనాలను నడుపుతూ రోడ్లను ఛిద్రం చేస్తున్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు చెందిన కంపెనీ పనులు చేస్తుండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



కంబదూరు మండలం రాళ్ల అనంతపురం పంచాయతీ పరిధిలో ఎస్‌ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ డంప్ చేసిన ఇసుక, మెటీరియల్

పంచాయతీ తీర్మానమే లేదు

మా పంచాయతీలో అనుమతులు లేకుండానే ఎస్‌ఆర్‌సీ సంస్థ పనులు చేపడుతోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు తీర్మానం తప్పనిసరి. కానీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని సర్పంచులకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సామాజిక బాధ్యతగా పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. స్థానిక నేతల జేబుల్లోకి నిధులు వెళ్తున్నాయి. దీనిపై నెడ్‌క్యాప్, రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలి.

– మంగమ్మ, సర్పంచు, రాళ్ల అనంతపురం

ఈ-స్టాంప్ కుంభకోణంలో కొత్త మలుపు

- ఉన్నం మారుతి పాత్ర ఉందంటూ కొన్ని మీడియా చానళ్లలో ప్రసారం
- 'అమిలినేని' పనేనంటూ ఉన్నం అనుచరుల మండిపాటు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కళ్యాణదుర్గంలో వెలుగు చూసిన ఈ-స్టాంప్‌ల కుంభకోణం కొత్త మలుపు తీసుకుంది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి తనయుడు ఉన్నం మారుతి ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్నాడంటూ కొన్ని మీడియా చానళ్లలో ప్రసారం కావడం చర్చనీయాంశమైంది. నిందితుడు ఎర్రప్ప, మరొకరితో మారుతి చౌదరి ఫోన్‌లో మాట్లాడాడంటూ వచ్చిన వార్తలు కలకలం రేపాయి.

ఉన్నం వర్గం మండిపాటు

అయితే, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కావాలనే తనకు అనుకూలంగా ఉన్న మీడియాలో ఇలా ప్రసారం చేయించారంటూ ఉన్నం అనుచరులు మండిపడుతున్నారు. ఈ-స్టాంపుల కుంభకోణం నేపథ్యంలో ఎమ్మెల్యే అమిలినేనికి చెందిన ఎస్‌ఆర్‌సీ ఇన్‌ఫ్రా కంపెనీ ప్రతిష్ట మసకబారడంతో ఆ మరకను చెరిపేసుకునేందుకు మారుతి చౌదరిపై నిందలు వేస్తున్నారని అనుచరులు పలువురు వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా పోలీసులు ఈ-స్టాంపుల కుంభకోణంపై లోతుగా విచారణ జరిపితే అసలు సూత్రధారులు బయటకు వస్తారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద మృతి

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన వడ్డె కుమార్(42) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన జోగప్పగారి హనుమంతు ఇంటి నిర్మాణ పనుల్లో కుమార్ పాల్గొన్నాడు. మధ్యాహ్నం ఉన్నఫళంగా కుప్పకూలాడు. గమనించిన హనుమంతు, తదితరులు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక కుమార్ మృతి చెందాడు. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుమార్ కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

యాడికి: పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. యాడికిలోని అంకాలమ్మ వీధికి చెందిన వృద్ధుడు బోయ ఆదెప్ప మద్యం మత్తులో ఆదివారం సాయంత్రం ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి ప్రయత్నించాడు. బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆదెప్పపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం మధ్యాహ్నం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

6 పోస్టులు...172 దరఖాస్తులు!

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఆరు సెక్టోరియల్ పోస్టుల భర్తీకి సంబంధించి మొత్తం 172 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుకు సోమవారంతో గడువు ముగిసింది. ఏఎంఓ, అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ), అసిస్టెంట్ సీఎంఓ, ఏఎస్ఓ, అసిస్టెంట్ ఐఈడీ, అలెస్కో పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో అత్యధికంగా అసిస్టెంట్ సీఎంఓ పోస్టుకు 48 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత అలెస్కో పోస్టుకు 45 మంది, ఏఎంఓకు 37 మంది, అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ)కు 14 మంది, అసిస్టెంట్ ఐఈడీకి 14 మంది, ఏఎస్ఓ పోస్టుకు 13 మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి స్క్రూటినీ చేసి నిబంధనల మేరకు భర్తీ చేస్తామని ఏపీసీ టి.శైలజ స్పష్టం చేశారు.

పేకాట ఆడుతూ పట్టుబడిన జేసీ అనుచరులు



పేకాట రాయుళ్లను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: స్థానిక రూరల్ పరిధిలోని కడపరోడ్డు శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న 13 మందిని స్పెషల్‌పార్టీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి.. రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డికి అప్పగించారు. వీరంతా మునిసిపల్ చైర్మన్, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు కావడం గమనార్హం. వీరి నుంచి రూ.1,23,700 నగదు, 13 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో తాడిపత్రిలోని గన్నెవారిపల్లెకాలనీకి చెందిన జేసీ ప్రధాన అనుచరుడితో పాటు పలువురు టీడీపీ నాయకులు ఉన్నట్లు సమాచారం. అందరూ అధికార పార్టీ వారు కావడం, అది కూడా జేసీ అనుచరులు కావడంతో పట్టుబడిన వారి పేర్లను తెలిపేందుకు సీఐ నిరాకరించారు. కాగా.. టీడీపీ నేత ఇంట్లోనే కొద్దికాలంగా పోలీసుల కనుసన్నలోనే పేకాట ఆడుతున్నట్లు తెలిసింది. అనంతపురం స్పెషల్‌పార్టీ పోలీసులు పెద్దఎత్తున నగదు స్వాధీనం చేసుకుని అప్పగించినా స్థానిక పోలీసులు మాత్రం కొద్దిపాటి మొత్తాన్నే చూపుతున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది.

తీరని కన్నీటి వ్యథ



గుంతకల్లులో నిరసన తెలుపుతున్న మహిళలు

గుంతకల్లు: తాగునీటి కోసం స్థానిక బీటీ ఫక్కీరప్ప కాలనీ సోమవారం ఆందోళన చేపట్టారు. వారం రోజులుగా మున్సిపల్ కొళాయిలకు నీరు విడుదల కాకపోవడంతో కాలనీలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో సోమవారం సీపీఐ నాయకులతో కలిసి కాలనీ వాసులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కాలనీ లోనే జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీరభద్రస్వామి, గోపీనాథ్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ఫలితంగా కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో తాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని మండిపడ్డారు. 6 రోజులుగా తాగునీరు అందకపోతే ప్రజల దాహార్తి తీరేదెలా అని ప్రశ్నించారు. కాలనీలో డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, మధు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

కళ్యాణదుర్గం రూరల్: శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో కళ్యాణదుర్గంలోని పలు కాలనీల్లో మూడు నెలలుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. సమస్య మరింత జటిలం కావడంతో సోమవారం కళ్యాణదుర్గంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో పార్వతీనగర్, మారంపల్లి, వడ్డెబండ వీధి, రాచప్ప బావి కాలనీ వాసులు ఖాళీ బిందెలతో నిరసనవ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని వాపోయారు. కూటమి ప్రభుత్వానికి మద్యం సరఫరాపై ఉన్న శ్రద్ధ నీటి సరఫరాపై లేదని విమర్శించారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. రెండు రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపుతామని ఆర్డీటో వంసత్‌బాబు హామీనివ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'కు 91 వినతులు



అర్జీ దారుతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 91 వినతులు అందాయి. ఎస్పీ జగదీష్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో రెచ్చిపోయిన దొంగలు

- వేర్వేరు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల్లో నుంచి నగదు అపహరణ

ఉరవకొండ: స్థానిక బ్యాంక్‌ల వద్ద దొంగలు రెచ్చిపోయారు. వేర్వేరు బ్యాంక్ వద్ద కాపు కాచి ఖాతాదారుల నగదు అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు.. మోపిడి గ్రామానికి చెందిన రైతు గొర్తి శ్రీనివాసులు వేరుశనగ పంట సాగు పెట్టుబడుల కోసం సోమవారం ఉరవకొండలోని యూనియన్ బ్యాంక్‌కు చేరుకుని రెండు తులాల బంగారు నగలు తాకట్టు పెట్టి రూ.80 వేలు నగదు తీసుకున్నాడు. ఈ నగదును తన ద్విచక్ర వాహనంలోని బ్యాగ్‌లో ఉంచుకుని బయలుదేరుతుండగా తెలిసిన వ్యక్తి పలకరించడంతో వాహనం దిగి మాట్లాడాడు. అనంతరం వాహనం వద్దకు వచ్చి చూడగా డబ్బు కనిపించలేదు.

- మరో ఘటనలో

విడపనకల్లు మండలం చీకులగురికి గ్రామానికి చెందిన రైతు ఓబులేసు తన కుమారుడు ఇంజినీరింగ్ ఫీజు చెల్లించేందుకు డబ్బు అవసరమై భార్యతో కలసి ఉరవకొండ పోలీసుస్టేషన్ వెనుక ఉన్న స్టేట్‌బ్యాంకుకు సోమవారం వెళ్లాడు. తన భార్యకు చెందిన 3 తులాల బంగారు నగలు తాకట్టు పెట్టి రూ.1.30 లక్షలు తీసుకున్నాడు. ఈ డబ్బును తన ద్విచక్ర వాహనం బ్యాగ్‌లో ఉంచుకుని తిరుగు ప్రయాణమైన దంపతులు.. .స్థానిక క్లాక్‌టవర్ వద్ద కాయగూరలు కొనుగోలు చేసేందుకు ఆగారు. భార్య కాయగూరలు కొనుగోలు చేస్తుండగా భర్త వాహనంపైనే కూర్చొని ఉన్నాడు. ఆ సమయంలో ఓ దుండగుడు బైక్ సైడ్ బ్యాగ్‌లోని నగదును అపహరించాడు. భార్య వాహనం వద్దకు వచ్చిన తర్వాత పరిశీలిస్తే సైడ్ బ్యాగ్‌లో ఉంచిన నగదు కనిపించలేదు. తన కుమారుడి చదువుల కోసం భార్య నగలు తాకట్టు పెట్టి తీసుకున్న డబ్బును దుండగులు అపహరించడంతో ఓబులేసు ఆవేదనకు అంతులేకుండా పోయింది. ఫీజు చెల్లించకపోతే కుమారుడి చదువులు ఆగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ రెండు ఘటనలపై బాధితులు చేసిన ఫిర్యాదు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ జనార్దననాయుడు తెలిపారు.

బదిలీల నరకయాతన



జిల్లా పోలీసు కార్యాలయం వద్ద వేచి ఉన్న మహిళా పోలీసులు



తల్లులు కౌన్సెలింగ్‌లో ఉండగా చంటిపిల్లలను నిద్రపుచ్చుతున్న కుటుంబ సభ్యులు



అర్ధరాత్రి కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళా పోలీసులు

అనంతపురం: ఉమ్మడి జిల్లా సచివాలయ మహిళా పోలీసు సిబ్బంది బదిలీల ప్రక్రియ నరకయాతనను మిగిల్చింది. అనంతపురంలోని డీపీఓలో చేపట్టిన ఈ ప్రక్రియకు ఉదయం 8 గంటలకంతా హాజరు కావాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మధ్యాహ్నం 12 గంటలైనా కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టలేదు. 12 గంటల తర్వాత తొలుత స్పౌజ్, పీహెచ్‌సీ, మెడికల్ సర్టిఫికెట్ ఉన్న వారికి కౌన్సెలింగ్ చేపట్టారు. మూడు గంటల వరకు జనరల్ కౌన్సెలింగ్ ప్రారంభించలేదు. తెల్లవారుజామున మూడు గంటల వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో నిరీక్షణ తప్పలేదు. దీంతో చంటి పిల్లల తల్లులు, దూరప్రాంతాల నుంచి వచ్చిన వారి పరిస్థితి దయనీయంగా మారింది. అవివాహితులకు తోడుగా వచ్చిన తల్లిదండ్రులను లోపలకు అనుమతించకపోవడంతో వారు బయటే నిరీక్షించాల్సి వచ్చింది. మహిళల పట్ల పోలీసు శాఖ నిర్దయగా వ్యవహరిస్తోందని విమర్శలు వ్యక్తమయ్యాయి. చివరకు ఆదోనిలో ఓ మహిళా కానిస్టేబుల్ చనిపోయిన విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు స్పందించి ఆగమేఘాలపై పిల్లల తల్లులకు పాలు, జ్యూస్ అందించారు. కౌన్సెలింగ్ కేంద్రం పైన సేద తీరేందుకు అవకాశం కల్పించారు.

స్పౌజ్ కోటాలో అభ్యంతరాలు

స్పౌజ్ కోటాలో బదిలీలకు సంబంధించి తమ భర్త ఎక్కడ ఉంటాడో ఆ పరిసరాల్లోనే స్థానాన్ని కోరుకోవాలి. అయితే తాడిపత్రి, హిందూపురం పరిసరాల్లో పనిచేస్తున్న కొందరు ఆ స్థానాలు కాకుండా ఇతర ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు. దీనిపై మిగిలిన వారు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వారిని వెనక్కు పిలిపించి.. స్పౌజ్ పరిసర ప్రాంతాల్లో స్థానాన్ని కేటాయించారు.

అర్ధరాత్రి ఆందోళన

గణనీయమైన ర్యాంకు ఉన్న వారికి ముందస్తుగా అవకాశం కల్పించి.. వారు కోరుకున్న చోటుకు బదిలీ కల్పించాలి. అలాగే రేషనలైజేషన్‌లో పోస్టు కోల్పోయిన వారికి జనరల్ కేటగిరి కింద చివరన పిలవాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా కౌన్సెలింగ్ చేపట్టారు. దీంతో మహిళా కానిస్టేబుళ్లు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యపు సమాధానంతో పరిస్థితి అదుపు తప్పింది. దీంతో అర్ధరాత్రి కౌన్సెలింగ్‌ను నిలిపివేశారు. అనంతరం అధికారులు నచ్చచెప్పి తిరిగి కౌన్సెలింగ్‌ను కొనసాగించారు.

బదిలీలపై విచారణ చేపట్టాలి

- ఆర్‌డీకి ఏపీ సచివాలయాల ఉద్యోగుల సంఘం నాయకుల ఫిర్యాదు

అనంతపురం కార్పొరేషన్: సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని, వీటిపై తక్షణమే విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలంటూ మునిసిపల్ ఆర్‌డీ విశ్వనాథ్‌ను ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్‌డీ కార్యాలయంలో సోమవారం ఆర్‌డీని కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. స్పౌజ్‌కు సంబంధించి తప్పుడు సర్టిఫికెట్లు అందజేసిన కొందరు జిల్లా కేంద్రానికి బదిలీ పొందారని, వీటిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డీను కలసిన వారిలో ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జీవీవీ రాఘవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శి పులిబండ్ల నరసింహారావు, పెద్ద సంఖ్యలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే దివ్యాంగుల, స్పౌజ్ సర్టిఫికెట్లలో అక్రమాలకు పాల్పడి జిల్లా కేంద్రానికి కొందరు బదిలీ పొందారని, వీటిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌డీకి సచివాలయ ఉద్యోగులు కన్నయ్య, మహేష్ నాయక్, కవితమ్మ, బాలాజీ యాదవ్ ఫిర్యాదు చేశారు.

పీఆర్ ఎస్ఈగా ప్రభాకరరెడ్డికి అదనపు బాధ్యతలు

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖ అనంతపురం సర్కిల్ కార్యాలయ ఎస్ఈగా జి.ప్రభాకర్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) బి.బాలూనాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో పని చేసిన మహమ్మద్ జహీర్ అస్లాం సోమవారం సాయంత్రం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో పీఆర్ఐ డివిజన్ ఈఈగా పని చేస్తున్న ప్రభాకరరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతపురం ప్రాజెక్ట్ ఇంప్లిమెంట్ యూనిట్ ఇన్‌చార్జ్ ఈఈగా చిత్తూరు డీఈఈ సి.నవీన్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు ఆ శాఖ ఈఎన్‌సీ బాలూనాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

సజావుగా ఏఎన్ఎంల బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం మెడికల్: డీఎంహెచ్ఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ఏఎన్ఎంల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా జరిగింది. ఉమ్మడి జిల్లాలోని 803 మంది ఏఎన్ఎంలకు జూమ్ వీడియా ద్వారా డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి బదిలీల కౌన్సెలింగ్ చేపట్టారు. అర్ధరాత్రి వరకూ ఈ ప్రక్రియ సాగింది. సీనియర్ అసిస్టెంట్ కమలాకర్ రాజు, తదితరులు పాల్గొన్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 740 మందికి వారి సీనియారిటీ, ప్రగతి ఆధారంగా పోస్టింగ్ కల్పించారు.

ఇరు పార్టీల కార్యకర్తలపై సుమోటోగా కేసు నమోదు

తాడిపత్రి టౌన్: గత నెల 29న పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించారన్న కారణంతో టీడీపీ, వైఎస్సార్‌సీపీకి చెందిన 20 మంది కార్యకర్తలపై సుమోటోగా కేసు నమోదు చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. వీరిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రవితేజారెడ్డి, నవీన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ప్రణయ్ తదితరులు, అలాగే టీడీపీ కార్యకర్తలు మల్లికార్జున, పరమేష్, సుదర్శన్‌రెడ్డి, ఖాదర్, యాసిన్ తదితరులు ఉన్నారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక వర్గం ఎన్నికలకు పలువురి నామినేషన్

గుత్తి: స్థానిక ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక వర్గం ఎన్నికలకు సంబంధించి నామినేషన్‌ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ తరపున పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

నేటి నుంచి తూమాటి దోణప్ప శత జయంతి ఉత్సవాలు



ఆచార్య తూమాటి దోణప్ప (ఫైల్)

ఉరవకొండ: తెలుగు సాహితీ విజ్ఞాన గని, బహు భాషా పండితుడు ఆచార్య తూమాటి దోణప్ప శత జయంతి వేడుకలు నేటి నుంచి హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో జరగనున్నాయి. ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామానికి చెందిన దోణప్ప 1926, జూలై 1న సంజప్ప, తిమ్మక్క దంపతులకు జన్మించారు. ఆంధ్ర యూనివర్సిటీ, నాగార్జున విశ్వవిద్యాలయాల్లో తెలుగు ఆచార్యులుగా పనిచేశారు. హైదారాబాదులో ఆవిర్భవించిన తెలుగు విజ్ఞాన పీఠం డైరెక్టరుగా, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడిగానూ పనిచేశారు. ఆయన సాహితీ సేవలకు గుర్తుగా తెలుగు సాహితీ జగత్తు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహకాలు చేసింది.

కారుణ్య నియామకాల్లో జాప్యం వద్దు

అనంతపురం అర్బన్: కారుణ్య నియామకాల కింద పోస్టుల భర్తీ విషయంలో జాప్యానికి తావివ్వకూడదని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్ఓ ఎ.మలోలతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంత మందికి కారుణ్య నియామకాల కింద పోస్టులు ఇవ్వాలి.. వారికి సంబంధించి ఫైళ్లు సిద్ధం చేశారా.. తదితర వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కారుణ్య నియామకాల ద్వారా పోస్టుల భర్తీకి అవసరమైన చెక్‌లిస్ట్ తయారు చేయాలని చెప్పారు. ఏదేని నియామకం చేపట్టినప్పుడు రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఏ దశలోనూ వివాదాలకు, విమర్శలకు, తప్పులకు తావివ్వకూడదని చెప్పారు. నియామకానికి సంబంధించి ప్రతి అంశాన్ని ఒకటికి రెండుసార్లు సరిచూసుకున్న తరువాత సమగ్రంగా ఫైళ్లను అనుమతి కోసం ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, డిప్యూటీ తహసీల్దార్లు మారుతీప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నిర్మూలనపై 31 వరకు అవగాహన

అనంతపురం అర్బన్: జిల్లాలో మంగళవారం నుంచి ఈనెల 31 వరకూ డెంగీ నిర్మూలనపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో వైద్యారోగ్యశాఖ మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జాతీయ డెంగీ మాసోత్సవాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటుతో కలిగే దుష్పరిణామాలు, వాటి వ్యాప్తి, నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చైతన్య పర్చాలన్నారు. జ్వరం తరచూ వస్తుంటే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో పీఆర్ వ్యవస్థ నిర్వీర్యం

- వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రారెడ్డి
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వ అశాస్త్రీయ నిర్ణయాలతో పంచాయతీ రాజ్ (పీఆర్) వ్యవస్థ నిర్వీర్యమైందని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి విమర్శించారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు యోగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,150 కోట్లను కూటమి ప్రభుత్వం దారి మళ్లించడం సిగ్గు చేటన్నారు. వెంటనే ఈ నిధులను స్థానిక సంస్థల ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. కూలీలకు దక్కాల్సిన ఉపాధి నిధులను టీడీపీ నేతలు దోచుకుంటున్నారని మండిపడ్డారు. సర్పంచులను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపిస్తూ వారి పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తించకుండా చేసి ఆ డబ్బులనూ కూటమి ప్రభుత్వం వాడుకుందని ఆరోపించారు. తక్షణం సర్పంచుల పిల్లలకు తల్లికి వందనం పథకం లబ్ధి చేకూర్చాలని కోరారు. బిల్లుల చెల్లింపుల్లో రాజకీయ జోక్యం నివారించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 73, 74 సవరణల మేరకు సర్పంచులకు అధికారాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న 1,320 మంది పంచాయతీ కార్యదర్శులకు తక్షణమే పోస్టింగ్ ఇచ్చి పెండింగ్‌లో ఉన్న 9 నెలల వేతనం విడుదల చేయాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీలకు గౌరవ వేతనం తక్షణం చెల్లించాలన్నారు. డిమాండ్లను నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బసవరాజు, బండి కిరణ్ కుమార్, సంయుక్త కార్యదర్శులు సీవీ రంగారెడ్డి, సాదక్‌వలి, నియోజకవర్గ అధ్యక్షుడు మూలి లోకనాథరెడ్డి, విజయకుమార్, తిప్పేస్వామి, తిక్కస్వామి, భూతవి సుధాకర్, యోగేష్‌రెడ్డి, చిన్నరంగారెడ్డి, జెడ్పీటీసీలు జె.చంద్రకుమార్, ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రసాద్‌గౌడ్, సర్పంచులు ఓబులేసు, చిన్నరంగారెడ్డి, ఎర్రిస్వామి, హనుమంతరెడ్డి, ఆంజనేయులు, నాయకులు కుమ్మెత చంద్రశేఖరరెడ్డి, రుద్రనంద యాదవ్, రవికుమార్, రమేష్, అంజియాదవ్, బండిపవన్, గోవిందరెడ్డి, ఎర్రిస్వామి, ఆదినారాయణ, ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంపీపీలు, పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన వారిని సన్మానించిన కలెక్టర్ వినోద్‌కుమార్

మీ సేవలు అమూల్యం

అనంతపురం అర్బన్: ప్రభుత్వానికి, ప్రజలకు సుదీర్ఘకాలంగా అమూల్యమైన సేవలందించారంటూ ఉద్యోగ విరమణ చేసిన వారిని కలెక్టర్ కొనియాడారు. వివిధ శాఖల్లో ఉద్యోగ విరమణ చేసిన వారిని జిల్లా యంత్రాంగం తరఫున సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ ఎ.మలోల, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగ విరమణ చేసిన వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నేషనల్ 'డాక్టర్స్ డే' Happy Doctors Day శుభాకాంక్షలు... Special Feature











అధునాతన వైద్యం.. 'అనంత' సొంతం

- అందుబాటులో బైపాస్, న్యూరో సర్జరీలు



అనంతపురం మెడికల్: అనంతపురంలో అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైద్య సేవల విస్తృతిలో పెద్ద మార్పు వచ్చింది. ఒకప్పుడు చిన్నపాటి ప్రమాదం జరిగితే ఇతర ప్రాంతాలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. కర్నూలు, బెంగళూరుకు వెళ్లాల్సి వచ్చేది. అటువంటిది ఐదేళ్లలో అనంతపురం రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీతో పాటు కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులు పెద్ద సంఖ్యలో జిల్లా కేంద్రంలోనే ఉండడం గమనార్హం. గుండె సమస్యలకు సంబంధించి బైపాస్ సర్జరీ, ఇతర శస్త్రచికిత్సలు, న్యూరో సర్జరీలు, కేన్సర్, ప్లాస్టిక్ సర్జరీ, తదితర వాటికి కేంద్రంగా అనంతపురం నిలుస్తోంది. కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులు అందుబాటులో ఉండడంతో రోగులు బెంగళూరు, హైదరాబాద్ లాంటి ప్రధాన నగరాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్యం పొందుతున్నారు. వీటితో పాటు స్కాన్ సెంటర్లు, బ్లడ్ బ్యాంకులు అందుబాటులో ఉన్నాయి. రోగ నిర్ధారణకు సంబంధించి అత్యాధునిక వైద్య సదుపాయాలు లభిస్తున్నాయి.

విస్తరించిన నర్సింగ్ హోంలు..

జిల్లాలో మొత్తం క్లినిక్‌లు, పాలీ క్లినిక్‌లు, నర్సింగ్ హోంలు, డయాగ్నస్టిక్ సెంటర్లు 374 ఉన్నాయి. వాటిలో జిల్లా కేంద్రంలోనే 60 శాతం ఉండడం గమనార్హం. జిల్లాలో 20 పడకల నర్సింగ్ హోంలు 80, అలాగే 50 పడకల నర్సింగ్ హోంలు 50, వంద పడకల నర్సింగ్ హోంలు 21 ఉన్నాయి. చిన్న డయాగ్నస్టిక్ సెంటర్లు 46, పెద్దడయాగ్నస్టిక్ సెంటర్లు 13 ఉన్నాయి. వీటితో పాటు ఫెర్టిలిటీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. ఇక బోధనాస్పత్రికి సంబంధించి సూపర్ స్పెషాలిటీఆస్పత్రిలో 7 రకాల స్పెషలిస్టు వైద్యం అందుబాటులో ఉంది. ప్రభుత్వ, కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో లక్షలాది మంది రోగులు సేవలు పొందుతున్నారు. బళ్లారి, కర్నూలు, కడప, తెలంగాణలాంటి ప్రాంతాల నుంచి కూడా రోగులు వైద్యం కోసం అనంతపురం వస్తున్నారంటే వైద్య సేవలు ఏ స్థాయిలో విస్తరించాయో అర్థం చేసుకోవచ్చు. అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో గుండెకు సంబంధించి యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, ఇన్‌ట్రావాస్కులర్ ఇమేజింగ్, ఫ్రాక్షనల్ ఫ్లో రిసర్వ్, తదితర అధునాతన శస్త్రచికిత్సలు చేస్తారు. న్యూరో సర్జరీకు సంబంధించి పిట్యూటరీ ట్యూమర్ సర్జరీ (కోత లేకుండా ముక్కు ద్వారా సర్జరీ), స్పైనల్ డిస్క్ ప్రొలాప్స్‌ను మినిమలీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ (చిన్న కోత) ద్వారా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు అన్ని రకాల బ్రెయిన్, స్పైనల్ కార్డ్ ఆపరేషన్లను చేస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. సూపర్ స్పెషాలిటీలోకార్డియాక్, న్యూరో సర్జరీతో పాటు యూరాలజీ, కార్డియో థొరాసిక్, నెఫ్రాలజీ, న్యూరాలజీ, ఎండోక్రైనాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయి. జీజీహెచ్‌లో పాలియేటివ్ థెరపీ ఏళ్ల తరబడి దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతున్న రోగులకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పాలియేటివ్ థెరపీ ద్వారా వైద్యం అందిస్తున్నారు. తెలంగాణా, కర్నూలు, కడప ప్రాంతాల రోగులు కూడా ఈ సేవలను పొందుతున్నారు. వైద్య కళాశాల పట్ల ఆసక్తి గతంలో ప్రభుత్వ వైద్యకళాశాలలో పీజీ సీట్లు ఉండే పరిస్థితి లేదు. ప్రస్తుతం పీజీ సీట్ల సంఖ్య 300కు చేరింది. ఏటా 122 మంది పీజీ విద్యార్థులు చేరుతున్నారు. దీంతో పాటుగా యూజీ సీట్లు 200 ఉన్నాయి. 23 విభాగాల్లో వైద్యులు సేవలందిస్తున్నారు. న్యూరో సర్జరీ ఎంసీహెచ్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఆలిండియా కోటాలో విద్యార్థులు అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలోనే విద్యనభ్యసించాలని చూస్తుండటం విశేషం. రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాలల్లో అనంతపురం బోధనాస్పత్రి ఉండటం గమనార్హం.

































